# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-05-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశంలో 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 లోక్ సభ నియోజక వర్గాల్లో 6వ విడత పోలింగ్ ఈరోజు జరుగుతుంది.**
2. **ఆంధ్రప్రదేశ్ లో మొత్తం 5 లక్ష లకు పైగా పోస్టల్ బ్యాలట్ ఓట్లు పోలయ్యాయని ఎన్నికల సంఘం తెలిపింది.**
3. **తెలంగాణలోని వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల ప్రచారం ఈ రోజు సాయంత్రంతో ముగియనుంది.**
4. **వేసవి సెలవుల దృష్ట్యా జూన్ 30వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది.**
5. **ఈ రోజు ప్రపంచ థైరాయిడ్ నివారణ దినం నిర్వహిస్తున్నారు.**

==========================

దేశంలో 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 లోక్ సభ నియోజక వర్గాల్లో 6వ విడత పోలింగ్ ఈ రోజు జరుగుతుంది. బీహార్, హర్యాణా, జమ్ము కశ్మీర్, ఝార్ఖండ్, ఢిల్లీ, ఒడిస్సా, ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్లో ఈ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కాగా, దేశవ్యాప్తంగా మొత్తం 543 లోక్సభ స్థానాలు ఉండగా... ఆరో దశతో 486 సీట్లకు పోలింగ్ పూర్తవుతుంది.

--------------------------

ఆంధ్రప్రదేశ్లో ఎన్నికల సిబ్బంది, 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అత్యవసర సేవల్లో ఉన్నవారివి కలిపి మొత్తం 5 లక్షలకు పైగా పోస్టల్ బ్యాలట్ ఓట్లు పోలయ్యాయని ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల సంఘం అధికారికంగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం 4 లక్షల 97 వేల 718 పోస్టల్ బ్యాలట్ ఓట్లు వచ్చాయని, రాష్ట్రంలో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 38 వేల 865, ఆ తర్వాత నంద్యాల జిల్లాలో 25 వేల 283, మూడో స్థానంలో కడపలో 24 వేల 918 ఓట్లు ఉన్నాయని వెల్ల డించింది. ఇప్పటికే పోలైన పోస్టల్ బ్యాలట్ల వివరాలతో ఆయా జిల్లాల్లో కౌంటింగ్ బల్లలను ఏర్పాటు చేయాలని రిటర్నింగ్ అధికారులను ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

--------------------------

ఈనెల 27న ఉమ్మడి వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సెలవు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉప ఎన్నికల్లో ఓటు వేసేందుకు సంబంధిత జిల్లాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సెలవు ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రైవేటు ఉద్యోగులకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు. ప్రైవేటు కంపెనీలు, వ్యాపార సంస్థలు తమ సిబ్బంది ఓటు వేసేందుకు వీలుగా షిఫ్టులు సర్దుబాటు లేదా ఆలస్యంగా వచ్చేందుకు అనుమతి ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా తెలంగాణలోని వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల ప్రచారం ఈ రోజు సాయంత్రంతో ముగియనుంది.

---------------------------

వేసవి సెలవుల దృష్ట్యా తిరుమలలో భక్తులకు త్వరితగతిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనం కల్పించేందుకు జూన్ 30వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం–టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో సిఫార్సు లేఖలను ఆయా రోజుల్లో స్వీకరించడం లేదనే విషయాన్ని గమనించాలని టిటిడి భక్తులకు విజ్ఞప్తి చేసింది. సెలవుల కారణంగా ఏర్పడిన భక్తుల రద్దీతో సామాన్య భక్తులకు సర్వదర్శనానికి సుమారుగా 30 నుంచి 40 గంటల సమయం పడుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.

---------------------------

ఈ రోజు ప్రపంచ థైరాయిడ్ నివారణ దినం నిర్వహిస్తున్నారు. ఈ వ్యాధి సంబంధిత సమస్యలపై అవగాహన లేని కారణంగా అనేకమంది ఆరోగ్యసమస్యలకు గురౌతూఉంటారు. థైరాయిడ్ సమస్యలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ప్రతిసంవత్సరం మే 25వ తేదీ ప్రపంచ థైరాయిడ్ నివారణా దినంగా పాటిస్తున్నారు. థైరాయిడ్ గ్రంధి నిర్ణీతమోతాదుకంటే తక్కువగా హార్మోన్ విడుదలచేస్తే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. దీన్నే హైపోథైరాయిడిజమ్‌గా వ్యవహరిస్తారు. అంతర్జాతీయ థైరాయిడ్ సమాఖ్య ఈనెల 22వ తేదీ నుంచి 28వ తేదీవరకు థైరాయిడ్ అవగాహన వారంగా ప్రకటించింది.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ –ఐపిఎల్ క్రికెట్‌లో భాగంగా చెన్నై వేదికగా నిన్న రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన క్వాలిఫయర్–2 క్రికెట్ మ్యాచ్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్ 36 పరుగుల తేడాతో విజయం సాధించింది. చెన్నై ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 175 పరుగులు చేసింది. అనంతరం, లక్ష్యఛేదనలో రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 139 పరుగులు చేయడంతో హైదరాబాద్ జట్టు 36 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్ కు చేరుకుంది. రేపు చెన్నైలో జరిగే ఫైనల్ మ్యాచ్‌లో సన్ రైజర్స్ హైదరాబాద్, కోల్ కతా నైట్ రైడర్స్‌తో తలపడనుంది.

---------------------------

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో జూన్ 2న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల సంఘం అనుమతి లభించిన నేపథ్యంలో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చేయలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వివిధశాఖల అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణలో ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ విడుదల చేసింది. మొత్తం మూడు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ జరగనుందని పేర్కొంది. విద్యార్థులు.. కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందు పదవ తరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు, టీసీ, ఆదాయ , కుల ధృవీ కరణ వంటివి సిద్ధం చేసుకోవాలని సూచించింది. మరింత సమాచారం కోసం టీజీఈఏపీసెట్ వెబ్‌సైట్‌ని సందర్శించాలని తెలిపింది.

---------------------------

తెలంగాణలోని పాలిటెక్నిక్ కళాశాల్లో సీట్ల కేటాయింపుకు సంబంధించిన పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసింది. జూన్ 20 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుందని, జూన్ 22 నుంచి తొలి విడత వెబ్ ఐచ్ఛికాలను నమోదు చేసుకోవచ్చని తెలిపింది. వారికి జూన్ 30న సీట్ల కేటాయింపు ఉంటుంది. జులై 7 నుంచి రెండో విడత కౌన్సెలింగ్, జులై 9న వెబ్ ఐచ్ఛికాల ప్రక్రియ జరగనుందని, వీరికి జులై 13న సీట్లను కేటాయించనున్నామని సాంకేతిక విద్యాశాఖ పేర్కొంది.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం 24 గంటల్లో తుపానుగా మారే అవకాశం ఉందని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ఈ తుపానుకు రేమాల్ గా నామకరణం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇది ఈశాన్య దిశగా కదిలి బంగ్లాదేశ్ వద్ద 27వ తేదీ అర్ధరాత్రి దాటాక తీరం దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒడిశా, బెంగాల్, బంగ్లాదేశ్ పై తుపాను ప్రభావం ఉంటుందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలపై తుపాను ప్రభావం ఉండదని, అత్యధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వివరించారు. అలాగే సముద్రం ఆటుపోట్లకు గురయ్యే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు.

---------------------------

ఖరీఫ్ సీజన్‌లో తక్కువ కాలపరిమితి గల వరి వంగడాలను రైతులు సాగుచేసేలా చర్యలు చేపట్టాలని బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. నిన్న అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం నుండి మండల స్థాయి అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా ఖరీఫ్ సాగు, తుఫానుల కోసం విపత్తు నిర్వహణ, సన్నద్ధత చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుఫానులు, వరదలను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధం కావాలని ఆదేశించారు. విపత్తులను ఎదుర్కొనేలా ముందస్తు ఖరీఫ్, రబీ సీజన్ల పంటలను ప్రారంభించేలా జలవనరుల, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

---------------------------

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి ముందస్తుగా నిర్ణయించిన వ్యక్తులను మాత్రమే అనుమతించాలని బాపట్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పోలీసు అధికారులతో భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి ఒక మార్గం, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి మరొక మార్గాన్ని ఏర్పాటు

చేయాలన్నారు. మార్గాల వద్ద దిక్సూచి బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

-------------------------------

అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాలల లెక్చరర్ల పోస్టులకు అర్హత కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆధ్వర్యంలో  నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్హత పరీక్ష–ఏపీ సెట్ 2024 ఫలితాలు నిన్న విడుదలయ్యాయి. ఏప్రిల్ 28న రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్ష నిర్వహించగా నిన్న ఫలితాలను విడుదల చేశారు. అర్హత సాధించిన అభ్యర్థుల  తుది కీ, సబ్జెక్టుల వారీ కటాఫ్ మార్కులు, ర్యాంక్ కార్డులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు.

======================